


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ



– వసుంధర

***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (39)*

**కవిబాబుకి** అంత కోపమెందుకొచ్చిందో అర్థం కాక తికమకపడ్డాను. కానీ శ్రీమతికి అర్థమైనట్లే ఉంది.

ఆమె గొంతు సవరించుకుని, "చాలా ఏళ్లుగా కాఫీ కలుపుతున్నాను. ఐనా ఇంటికొచ్చినవాళ్లకి కాఫీ ఇవ్వాలంటే ఎప్పుడూ బెదురే నాకు. ఎందుకంటే మేమెవరం కాఫీ తాగం కదా! రుచి చూడకుండా అతిథులు మెచ్చేలా కాఫీ పెట్టాలని నాకు మనసు. పెడతానని నమ్మకం కూడా. అలాగని నేననుకుంటే సరిపోదు కదా, ఎదుటివాళ్లనాలి. అందుకే, అసలు మీరు ఇంటికి రాగానే ముందు కాఫీ ఇచ్చెయ్యాలని మనసు తెగ పీకింది. కానీ మొదటి ఐటమే, షేర్ చేసుకోనిదైతే ఎలా అని కూడా అనిపించి, మనసుకి నచ్చజెప్పాను. మీరు కాఫీ తాగండి. మన నెక్స్‌ట్ టాపిక్ కాఫీ. దాని గురించి బోలెడు కథలు, కబుర్లు చెప్పుకోవచ్చు. ఆపైన నా కాఫీపై మీ అభిప్రాయం చెప్పి, సూచనలుంటే ఇవ్వండి. నాకవి చాలా విలువైనవి" అంది.

ఆశ్చర్యంగా ఆమెని చూశాను. అంతగా పరిచయంలేని ఓ కొత్త మనిషితో, తనంత ధారాళంగా మాట్లాడగా చూడ్డం అదే ప్రథమం నాకు.

స్వతహాగా మితభాషి. కొత్తవాళ్లముందైతే ఎంతో అవసరమైతే తప్ప నోరే విప్పదు. ఇప్పుడు అవసరానికి మించి ఇంతలా మాట్లాడిందంటే అందుకు ఏదో పెద్ద కారణముండి ఉండాలి. అది తర్వాత అడిగి తెలుసుకోవాలనుకుని, ఆమె మాటలకు కవిబాబు స్పందన ఎలాగుందోనని చూస్తే– అతడామె మాటలకు సంతృప్తుడై శాంతుడైనట్లు అనిపించింది.

కాఫీ చప్పరించడం మొదలెట్టాడు.

"పంచదార సరిపోయిందా?" అడిగింది శ్రీమతి.

"కాఫీకి రుచి ఇచ్చేది పంచదార కాదు. అది ఎక్కువైనా, తక్కువైనా, అసలు లేకపోయినా కూడా– కాఫీ రుచి కాఫీ మీదే ఆధారపడి ఉంటుంది. అదీ కాఫీ ప్రత్యేకత. ఈ కాఫీ బాగుంది" అన్నాడు కవిబాబు.

"అంటే పంచదార సరిపోయినట్లు లేదు. వంటింట్లోకెళ్లి పంచదార డబ్బా తెస్తాను" అంటూ లేచింది శ్రీమతి.

కవిబాబు వెంటనే కాఫీ కప్పు బల్లమీద పెట్టాడు– పంచదారకోసం ఆగుతాననిపించేలా.

శ్రీమతి అక్కణ్ణించి వెడుతూ, నాకు మాత్రమే అర్థమయ్యే సైగల ద్వారా నన్నూ రమ్మని చెప్పి వెళ్లిపోయింది.

నేను వెంటనే, "అయ్యో, పంచదార డబ్బా ప్లేస్ మార్చాను. చెప్పాలి" అంటూ లేచి గదిలోంచి బైటకెళ్లాను.

నేననుకున్నట్లే, "పంచదారకోసం అన్నదో వంక. మీకో విషయం చెప్పాలని ఇక్కడికి రమ్మన్నాను" అంది కిచెన్లో శ్రీమతి.

"ఏమిటా విషయం?" అడిగాను ఆశ్చర్యంగా.

"కవిబాబుకి మన ఆతిథ్యం చాల్లేదు. టమేటాబాత్ తర్వాత ఇంకా ఐటమ్సు ఉన్నాయని ఆశించాడు. కాఫీ తేవడంతో అక్కడితో, ఫలహార కార్యక్రమం ముగిసిందని అర్థమై అప్సెట్టయ్యాడు" అంది శ్రీమతి వంటగదిలో.

ఇలాంటివి ఆడవాళ్లు ఇట్టే పసి కట్టేస్తారనుకుంటాను. తను చెప్పేదాకా నాకు తట్టనే లేదు. తను చెబితే నిజమేననిపించింది.

అదే చెప్పి, "మనకతడు చుట్టమా, పక్కమా? ఇంటికొస్తే ఇంతకంటే ఏంచెయ్యగలం? ఇతడు చిత్రమైన మనిషిలా ఉన్నాడు. ఇంతవరకూ ఎవరూ ఇలా అప్సెట్టయినట్లు లేదు" అన్నాను.

"ఒకొక్కరు ఒకోలా ఉంటారు. ఇతడికి తిండిపుష్టి ఉన్నట్లుంది. మన తిండికోసం మొహంవాచి ఉన్నా ఆశ్చర్యం లేదు. అందుకే చప్పున బయటపడిపోయాడు. అందుకే నేనతడికి కాఫీ గురించి కాస్త ఎక్కువ మాట్లాడి సంజాయిషీ ఇస్తున్నట్లు మాట మార్చాను. దాంతో అతడికీ తన పొరపాటూ, తొందరపాటూ అర్థమై, సద్దుకునేందుకు వీలౌతుందనుకున్నాను" అంది శ్రీమతి.

ఆడవాళ్లది అమృతహృదయం. ఆమె అతణ్ణి తప్పు పట్టలేదు. అర్థం చేసుకుంది.

"మరి మనమిప్పుడేం చెయ్యాలి? భోజనానికి ఉండిపోమందామా?" అన్నాను.

శ్రీమతి తల అడ్డంగా ఊపి, "ఏదో ఇంత చారూ అన్నం పెడితే, అతణ్ణి మరింత అసంతృప్తికి గురి చేసినవాళ్లమౌతాం. విధం చెడ్డా ఫలం దక్కదు. పోనీ అని ఘనంగా విందుభోజనం పెడదామా అంటే, ఇప్పటికిప్పుడు వీలయ్యేది కాదది" అంది.

"సరే, ఏంచేస్తాం? ఇలాంటప్పుడు ఊరుకోవడమే ఉత్తమం" అన్నాను.

శ్రీమతి మళ్లీ తల అడ్డంగా ఆడించి, "మనింటికొచ్చిన మనిషి ఇలా అసంతృప్తిగా వెళ్లడం నాకు బాగా లేదు. మీరతణ్ణి మరోసారి మనింటికి రమ్మని పిలవండి. ఆ పిలుపెలా ఉండాలంటే, అతడీరోజు కూడా తృప్తిగా ఇంటికెళ్లాలి. అది మీకు వెన్నతో పెట్టిన విద్యేగా" అంటూ చిన్నకప్పులో కొన్ని పంచదార క్యూబ్సు వేసి, అందులో ఫోర్‌సెప్సు ఉంచింది.

ఆమె బాధ అర్థమైంది. ఆమె సూచన కూడా నాకు నచ్చింది. ఇద్దరం మళ్లీ మా గదిలోకెళ్లాం.

శ్రీమతి కప్పు అతడిముందు పెట్టి, తనూ కుర్చీలో కూర్చుంది. నేను తన పక్కనే కూర్చున్నాను.

అప్పుడు కవిబాబు కప్పు తీసుకుని మళ్లీ కాఫీ నెమ్మదిగా చప్పరిస్తున్నాడు. ఐతే పంచదార వేసుకోలేదు.

అతడు కాఫీ తాగడమయ్యేదాకా కాసేపు మామధ్య మౌనం.

కవిబాబు కప్పు బల్లమీద పెట్టి, "కాఫీ చాలా గొప్పగా, ఆస్వాదించేలా ఉంది. వేరేలోకం లోకి వెళ్లిపోయాను" అన్నాడు.

"మర్యాదకి అలా అంటున్నారు" అంది శ్రీమతి మొహమాటంగా.

"బాగోలేనివాటిని మర్యాదకి కూడా మెచ్చుకోకూడదు. నాకిలాగే ఇష్టమనుకుని మళ్లీ మళ్లీ అలాగే చేస్తారు. తరచుగా మీ ఇంటికి రావాలనుకునే నాకదో ఇబ్బంది" అని నవ్వి, "మీ కాఫీ పెర్ఫెక్ట్. పంచదారతో సహా అన్నీ ఎంత పడాలో అంతే పడ్డాయి. అందుకే మీరు పంచదార తెస్తానంటే వద్దనలేదు. ఎందుకంటే, ఎదుట పంచదార వేసుకునే అవకాశమున్నాకూడా వేసుకోకపోతే– పంచదార సరిపోయిందని మీకు నమ్మకం కలుగుతుంది. అతిథిని సంతోషపెట్టాలని గృహస్థులకు ఉన్నట్లే, గృహస్థుల్ని సంతోషపెట్టాలని అతిథికీ ఉంటుంది మరి" అని గొప్పగా శ్రీమతి వంక చూశాడు కవిబాబు.

అతడూ ఇందాకటి తన అకారణ అసహనాన్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నాడని గ్రహించి, 'మాటకారే' అనుకున్నాను. ఆ మాటకారితనంతోనే తను మా ఇంటికి మళ్లీ మళ్లీ వస్తుంటానని కూడా సూచించాడు.

శ్రీమతి చెప్పింది చెయ్యడానికి ఆ సూచన నాకు సహకరించింది. నేను గొంతు సవరించుకుని, "పనిమీద ఈ దేశానికొచ్చినవాళ్లం. మనకా పనితోనే సరిపోతుంది. మళ్లీ మళ్లీ కలుసుకోవడం ఎక్కడ కుదురుతుందిలెండి" అని ఆగాను.

ఎదుటివాడికి నెగెటివ్ సంకేతాలు పంపినప్పుడే, తర్వాత వెళ్లే పాజిటివ్ సంకేతాలు మంచి కిక్ ఇస్తాయి. అదో టెక్నిక్కు.

నేను మాట ఆపగానే, కవిబాబు మొహంలో నేనూహించిన ఇబ్బంది కనిపించింది.

నేను తృప్తిపడి, "కానీ– ఈరోజు ఏదో పరిచయానికన్నట్లు కలుసుకున్నాం. మాది పిలుపూ కాదు, మీది విజిట్టూ కాదు. మనమోసారి పూర్తిగా ఓ పూటంతా సరదాగా గడిపేలా కలుసుకోవాలనుంది. మీరు కాదనకుండా వీలు చేసుకోవాలి" అని అభ్యర్థించాను.

కవిబాబు మొహం వికసించింది, "నాకు పని ఒత్తిడి ఎక్కువని చాలా కరెక్టుగా గ్రహించారు. ఐనా మనసుంటే మార్గముంటుంది. తొందర్లోనే మళ్లీ ఎప్పుడొచ్చేదీ మీకు చెబుతాను. కానీ ఉన్నంతసేపూ ఇలా ఇంట్లో కూర్చుని కబుర్లాడ్డానికి కాదు. మధ్యలో ఓసారి మనకి దగ్గర్లోని యాత్రాస్థలానికి వెడదాం. అలాంటివి ఫ్రెండ్సుతో చూస్తే ఎక్కువ బాగుంటాయి" అన్నాడు.

"చాలా బాగుంది. కానీ ఇక్కడికి దగ్గర్లో యాత్రాస్థలాలేమున్నాయ్" అన్నాను.

"అదేంటండీ, మీరున్న లొకేషన్ చుట్టూ యాత్రాస్థలాలే. వాటికి వెతుక్కోవాలా? నాకైతే మీ ఇల్లే ఒక యాత్రాస్థలం" అన్నాడు కవిబాబు.

"మీ కాంప్లిమెంటుకి థాంక్సు. మా ఇల్లు కాక మరొక్కటి చెప్పండి" అన్నాను.

"ఇప్పటికి ఒక్కటే చెబుతాను. చార్లోటెన్‌బర్గ్ పాలేస్" అన్నాడతడు.

మా ఇంటికి నాలుగు నిముషాల నడక దూరంలో డాయిచే ఓపర్ ఊబాన్‌హాఫ్ ఉంది. అక్కడికి కంటికి కనిపిస్తూంటుంది చార్లోటెన్‌బర్గ్ పాలేస్. రోడ్డు పక్కనే ఉండడంవల్ల చాలాసార్లు చూశాం ఆ భవనాన్ని. అదో యాత్రాస్థలమని ఎప్పుడూ అనుకోలేదు.

"ఏమిటి– దాని స్పెషాలిటీ" అన్నాను.

"మీరెప్పుడూ టూరిస్ట్ గైడ్ పుస్తకం చూడలేదా? అందులో మొదటి రెండు పేజీల్లోనే ఉంటాయి దాని వివరాలు" అన్నాడు కవిబాబు.

పాశ్చాత్యుల ప్రత్యేకత అదే!

మనూళ్లో వెయ్యేళ్ల క్రితం గుడి ఉంటే, మామూలుగా దర్శనం చేసుకొచ్చేస్తాం మనం. వాళ్లకి తాతలనాటి ఇల్లు వందేళ్లక్రితందైతే చాలు– అదో టూరిస్ట్ అట్రాక్షన్.

ఆ మాట చెప్పి నవ్వేస్తే, "అలా తేలిగ్గా తీసెయ్యకండి. ఈ భవంతికి గొప్ప చరిత్ర ఉంది" అన్నాడు కవిబాబు.

అప్పుడు కవిబాబు మాకేం చెప్పాడూ, ఆ భవంతిలో మేమేం చూశాం అన్న విశేషాలు ఇప్పటివాళ్లకి గూగుల్ లెక్కల్లో దొరికేస్తాయి. అందుకని వాటి జోలికి ఇప్పుడు వెళ్లడం లేదు.

ఓ ఆదివారం ఉదయం కవిబాబు ఎనిమిదిలోగా మా ఇంటికొచ్చాడు. అప్పటికి మేము వంట పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నాం.

దోశల ఫలహారం, కాఫీ అయ్యేక అంతా కలిసి నడుచుకుంటూ వెళ్లి పది నిముషాల్లో ఆ భవనం చేరుకున్నాం.

బయటికి అందమైన ఓ పెద్ద భవనంలా కనబడినా లోపల చాలా పెద్ద ఆవరణ ఉంది. చుట్టూ ఓ పెద్ద తోట. దాన్నానుకుని అందమైన చిన్న అడవి. లోపల ఓ మ్యూజియం.

ఐతే ఆ రోజు వాతావరణం అంత అనుకూలంగా లేదు. ఈదురుగాలి. ఓవర్‌కోట్లు వేసుకున్నాం కానీ చెంపలకు తగిలితే ప్రాణం జిల్లార్చుకు పోయేటంత చలి. వీలైనంతవరకూ జేబులు చేతుల్లోంచి తియ్యడంలేదు.

ఆ వాతావరణంలోనూ జనం తండోపతండాలుగా ఉన్నారక్కడ. కనీసం నాలుగు టూరిస్టు బస్సులు పార్కు చేసి ఉన్నాయక్కడ.

ఆ మాట నేనంటే, కవిబాబు గొప్ప మొహం పెట్టాడు. మమ్మల్ని అక్కడకు తీసుకొచ్చిన ఘనత తనదే కదా మరి.

పిల్లలకా ప్రదేశం అంత నచ్చలేదు. జంతువులు, ఆటబొమ్మలు వగైరాలు అక్కడ లేవు. మ్యూజియం వాళ్లని ఏమాత్రం ఆకర్షించలేదు.

చలి ఐనా సరేనని బయట తోటలోకి వెడదామన్నారు. కవిబాబు కూడా పిల్లలకే ఓటేశాడు.

తోటలోకొస్తే,, పులిమీద పుట్రలా అప్పుడే వడగళ్ల వాన మొదలైంది. కానీ విచిత్రంగా అదే అక్కడ మాకు అపురూప అనుభవమైంది.

అలాంటి వడగళ్లు మేమెప్పుడూ చూసి ఎరుగం.

మామూలుగా వడగళ్లు గులకరాళ్లలా ఉంటాయి. ఒకోసారి కంకరరాళ్లలా కాస్త పెద్దవి ఉంటాయి.

ఈ వడగళ్లు హోమియోపతీ మాత్రలంత చిన్నవి. వాటిని చూడగానే, హైనమన్ తన హోమియోపతీ మందుల తయారీకి మాత్రల్ని ఇక్కణ్ణించే తెచ్చుకుంటాడా అనిపించింది.

పిల్లలు కూడా ఆ వడగళ్లని చూసి చలిని కూడా మరిచి మురిసిపోయారు. చేత్తో పట్టి గుప్పెళ్లతో ఓవర్‌కోటు జేబుల్లో వేసుకున్నారు.

"చాలా దేశాలు తిరిగాను. ఇలాంటి వడగళ్లు నేనెక్కడా చూడలేదు" అన్నాడు కవిబాబు.

ఇప్పటికీ మాకు ఆ భవనాన్ని తల్చుకుంటే ఆ వడగళ్లే గుర్తొస్తాయి.

పిల్లలు అలిసిపోయారని గ్రహించి పదకొండు దాటగానే మేము ఇంటిమొహం పట్టాం.

ఆ రోజు భోజనానికి టమేటాపప్పు, బంగాళాదుంపల కూర, కొబ్బరికాయపచ్చడి, సాంబారు ఐటమ్సు.

కవిబాబు మొహంలో సంతోషం. భోంచేస్తూ వంటకాల రుచిని మెచ్చుకుంటూ తెగ పొగిడాడు. ఆ మాటలకు పెదవి చివర్నించి వచ్చిన కృత్రిమత్వం కాక, అతిథి మనసులోంచి వెలువడ్డ సంతృప్తి గుబాళింపులున్నాయి.

భోజనమయ్యేక, "తప్పనిసరై చేతులు కడుక్కుందుకు లేచాను తప్ప, నిలబడ్డమూ కష్టమే" అంటూ కుర్చీలో వాలిపోయాడతడు.

మాకున్నది ఒకటే మంచం. నిద్రొస్తే పడుకున్నా, మెలకువగా ఉంటే అది ప్లేగ్రౌండ్ కూడానని చూడగానే తెలిసిపోతుంది. అందుకని, "మీరూ ఇంట్లో మనిషే కాబట్టి సంకోచించకుండా, మా పిల్లల ప్లేగ్రౌండుని మీరు నడుం వాల్చుకుందుకు ఆఫర్ చేస్తున్నాను" అన్నాను.

అతడు నవ్వి, "మీరు ప్లే గ్రౌండంటున్నారు. నాకైతే మంచం డైనింగ్ టేబుల్ కూడా. దానిమీద కూర్చుని, వళ్లో ప్లేటు పెట్టుకుని, తినేది తింటూ టేపులో పాటలు వింటుంటా" అని ఓ క్షణమాగి, "తప్పేముంది– జర్మన్సు ఆడేది ఫుట్‌బాల్ కాబట్టి ఆరుబయట పెద్ద ప్లేగ్రౌండ్ కావాలి. ఇండియన్సు ఎక్కువగా ఆడేది ఫుడ్‌బాల్ కాబట్టి, మంచం కూడా ప్లేగ్రౌండుగా పనికొస్తుంది మనకి" అన్నాడు.

ఆ చలోక్తి పాపకీ అర్థమైనట్లుంది, "భలే చెప్పారంకుల్! అమ్మ ఒప్పుకోదని కానీ మంచంమీద ఫుడ్‌బాల్ ఆడ్డం నాకూ ఇష్టమే" అంది.

"తాత్తూయాను (నాకూడాను)" అన్నాడు బాబు వెంటనే.

బాబుకి అక్షరాలిప్పుడు బాగానే పలుకుతున్నాయి. ఐనా తనూ ఏదైనా చెప్పాలని తొందరపడితే ముద్దమాటలు వచ్చేస్తాయి.

మంచంమీద కూర్చుని తినడానికి ఒప్పుకోదు శ్రీమతి. ఐనా ఒకోసారి పిల్లలు ప్లేట్లు పట్టుకుని మంచం ఎక్కేస్తారు. అప్పుడు తను వాళ్లని బాగా తిడుతుంది. పాప ఇప్పుడా తిట్లన్నీ ఏకరువు పెడితే, అవి కవిబాబుకీ తగిలి మమ్మల్ని ఇబ్బందిలో పడేస్తాయి.

అందుకని శ్రీమతి చటుక్కున పాప చెయ్యి పట్టుకుని పక్కకి లాక్కెళ్లి, “నువ్వు కాసేపు మాట్లాడకు” అంది.

సాయంత్రం మూడయ్యేక కవిబాబు మరి లేస్తానంటే, “అప్పుడేనా? కాసేపాగి ఫలహారం చేసి వెడుదురుగాని” అన్నాను నేను.

“ఫలహారమా? ఇన్ని తిన్నాక ఇంకానా?” అన్నాడు కవిబాబు.

కవిబాబు దగ్గర సీను రివర్స్ ఔతుందని ఊహించలేదు. చప్పున శ్రీమతిని చూశాను.

ఆమె కళ్లలో వెలుగు. మొదటి విజిట్లో కాఫీ ఇస్తే. అప్పుడేనా అన్న మనిషి, ఈరోజు ఫలహారం ఉందంటే, ఇంకానా, అంటున్నాడు. ఒక ఇల్లాలికి అంతకంటే సంతోషాన్నిచ్చే మాటేముంటుంది?

ఐనా శ్రీమతి ఊరుకోలేదు. ఓ అరగంట తర్వాత అతడికి ఉప్పుపిండి పులిహోరతో పాటు, ఐస్క్రీం కూడా పెట్టింది.

అతడు తప్పదన్నట్లు రెండూ కొంచెం కొంచెం రుచి చూసి వెళ్లాడు.

అది ఊదరగొట్టడం కాదు. గతంలో జరిగిందానికి ప్రతీకారం కాదు. అతిథిగా అతడంటే మాకున్న కన్సర్న్.

ఆ తర్వాత అతడోసారి మమ్మల్ని తనింటికి రమ్మని బలవంతపెట్టాడు. రాలేమంటే మరి మా ఇంటికి రానని బెదిరించాడు.

బెర్లిన్లో మేమో చివర ఉంటే, అతడుండేదింకో చివర. అక్కడికెళ్లాలంటే, మధ్యలో ఊబాన్లో తూర్పు బెర్లిన్ దాటాలి.

ఓ ఆదివారం అతడింటికి వెళ్లాం. అతడుండే గది బ్రహ్మచారి కొంపకి మచ్చులా ఉంది.

అతడు మమ్మల్ని ఆత్మీయంగా ఆదరించాడు. “శ్రీవైష్ణవుణ్ణి. ఇది నా స్పెషల్” అంటూ మాకోసం దద్ధోజనం చేసి ఉంచాడు. అది మనవైపు గుళ్లలో లభించే ప్రసాదమంత గొప్పగా లేకపోయినా, అతడి ప్రేమాభిమానుల్ని రంగరించుకుని మమ్మల్ని అలరింపజేసింది.

పాయసంలాంటిది పెట్టాడు. పిల్లలకి చాక్లెట్లు ఇచ్చాడు. వెంటనే తినమని బలవంతపెట్టాడు కానీ అప్పట్లో మా పిల్లలకి ఆ చాక్లెట్లు బొత్తిగా నచ్చేవి కాదు. భుక్తాయాసం వంకపెట్టడంతో ఆ ఇబ్బంది ఇరుపక్షాలకూ సంతృప్తికరంగా సద్దుకుంది.

"దగ్గర్లో యాత్రాస్థలాలు లేవు కానీ, ఓ పెద్ద పార్కుంది. ఆదివారాలు మ్యూజిక్ పార్టీలుంటాయి" అంటూ మమ్మల్ని బయటకు తీసుకెళ్లాడు.

అక్కడ ఆట్టే జనాలు లేరు కానీ, గిటార్లు, డ్రమ్ములు వగైరాలతో ఓ మ్యూజిక్ బాండ్ ఉంది. ప్రత్యక్షంగా అలాంటివి చూడ్డం మొదటి సారి కాబట్టి, మావాళ్లు కాసేపు ఆ పాటలు వినోదించారు.

ఆ ట్రిప్పులో మాకు రెండు విషయాలు అర్థమయ్యాయి. మా ఆతిథ్యం కవిబాబుకి ఎంత తృప్తినిచ్చిందంటే, తనూ బదులు తీర్చుకోవాలని తాపత్రయపడుతున్నాడు. రెండు– ఆతిథ్యంలో మాకు దీటు రాలేకపోతున్నానన్న భావనలో ఉన్నాడు. అది పోవడంకోసం మేమతణ్ణి పదేపదే మా ఇంటికి రమ్మని ఆహ్వానించేవాళ్లం.

కానీ ఎవరి పన్లు వాళ్లవిగా– అతడు మా ఇంటికి మరో మూడునాలుగుసార్లు వచ్చాడేమో!

వచ్చినప్పుడు– దుర్వాసుడి ముఖభావాలకి తావివ్వలేదు. అప్పుడేనా, ఇంకానా– లాంటి పదాలు అవసరపడలేదు. అందువల్ల అతడూ, మేమూ కూడా ఆ విజిట్లని ఎంతో ఎంజాయ్ చేశాం.

బెర్లిన్ జ్ఞాపకాలుగా అప్పట్లో మా ఇంటికొచ్చినవారి గొంతులు రికార్డు చేసేవాణ్ణి. అలాంటప్పుడు ఏంచెప్పాలో తెలియక కొందరు ఇబ్బంది పడేవారు. ఒకసారి అలాగే గుప్తా అనే ఉత్తరాది మిత్రుడు తటపటాయిస్తే, "జస్ట్ అప్రీషియేట్ హిమ్" అంది అతడి భార్య.

అప్పుడు నేను ఇబ్బంది పడ్డాను. మెప్పు కోసమే ఆ కార్యక్రమం పెట్టానా అని!

కవిబాబుతో ఆ ఇబ్బంది లేదు. అతడు మంచి కవి.

ఒకసారి అతడు తనతోపాటు– న్యూక్లియర్ ఫిజిక్సులో డాక్టరేట్ చేసిన రెడ్డి అనే ఓ సైంటిస్టుని తన వెంట తీసుకొచ్చి పరిచయం చేశాడు. అది అవకాశంగా తీసుకున్నాను. ఆతిథ్యమయ్యేక అతడికి మైక్రోఫోన్ అందించి, "మీ కవితలు మీ నోట వినాలనుంది" అన్నాను.

అప్పుడతడు రెండు కవితలు చదివాడు.

కవులను అంచనా వేసే సామర్థ్యం నాకు లేదు కానీ, అతడి కవితలు విశిష్టమైనవని నాకు తోచింది. గొంతు గంభీరమైనది కావడం, తనే స్వయంగా చదవడంవల్లనేమో– విరుపులు అర్థవంతమై, భావం అద్భుతమైందని నాకు అనిపించింది.

ఇప్పటికీ అతడి గొంతులో ఆ కవితలు మావద్ద టేపులో ఉన్నాయి. వాటినిక్కడ మీతో పంచుకుంటున్నానుః

మొదటి కవిత

సందర్భముః పారిస్ నుంచి బెల్జియం ద్వారా హాలండ్ వెళ్లే ప్రయాణంలో కార్లో వెడుతూ మధ్యలో ఆగి ముఖ్యంగా బెల్జియంలో ఒకచోట పొలాల్లో మేస్తున్న నల్లటి ఆవుల్ని చూసి ఏదో ప్రేరణ కలిగితే వ్రాసిన ఒక గేయం

పచ్చగడ్డి తిన్న నల్లావు తెల్ల పాలిస్తుంది

అనంతమైన నీలాకాశంలో నల్లనల్లని మబ్బుతునకల మధ్య తెల్లతెల్లని విద్యుల్లతలు విరుస్తాయి

ఎర్రమట్టిలో పుట్టిన ఆ నల్లమామి చెట్టు పైగా పచ్చని ఆకుల్లోంచి తొంగిచూచే ఎర్రని పూలు ప్రసరిస్తుంది

రోజా రంగు చీర కట్టిన ఆమె బంగారు రంగుఛాయలీనే ముఖంపైన తెల్లని పెదాలపై ఎర్రని చిరునవ్వు మెరుస్తుంది

ఉంగరాల జుట్టు నల్లని నీగ్రోవాడిలోనూ

తెలుపూ ఎరుపూ రంగురంగుల మనుషుల్లో మాదిరి

ధవళ ధవళ ధగద్ధగాయమాన జీవన తేజోరేఖ మిలమిలామంటోంది

రెండవ కవిత

వచ్చాను యూరపుకు

తెచ్చాను వెంట మానవతావాదాన్ని

ఇస్తున్నాను సమైక్యతా మాధుర్యాన్ని

జాతులు వేరు నీతులు వేరు భాషలు వేరు వేషాలు వేరు

ఐనా మానవత ఒక్కటే మానవ జీవిత మకరందం ఒక్కటే

అక్కడా ఇక్కడా అంతటా మనిషి ముఖ్యం మనిషి మనస్సు ముఖ్యం

ఐతే

ఎందుకీ యుద్ధాలు పరస్పర విరుద్ధాలు

దానికి కారణం ఉంది సోదరా

మనిషి మంచివాడు

మనిషి చెడ్డవాడు

మంచీ చెడ్డా కలగాపులగపు సంస్కృతి మానవ సంస్కృతి

మనిషి మంచివాడై కోరికల పొలిమేరలలో అడుగిడతాడు సామరస్యపు నిలయాలకు పరుగిడతాడు

మనిషి చెడ్డవాడై ద్వేషిస్తాడు తేడాల నీడల వెంటపడి పోతాడు

తోటి మానవునితో తలపడతాడు

మనిషి మారితే అన్నీ మారతాయి

కవిబాబు ఈ కవితలు చదివేక, అతడితోపాటు వచ్చిన రెడ్డిగారిని ఆ కవితలపై అభిప్రాయం చెప్పమని అడిగాను.

“ఏదో సైంటిస్టుని. కవిత్వం గురించి నేనేం చెప్పగలను?” అన్నాడు రెడ్డిగారు.

నా ఉద్దేశ్యం ఆ సందర్భానికి జ్ఞాపకంగా, రెడ్డిగారి గొంతు రికార్డు చెయ్యడం. అలా అడిగితే, "జస్ట్ అప్రీషియేట్ హిమ్" అన్న గుప్తా భార్య మాటలు చెవుల్లో గింగురుమంటాయి. అందుకని అప్పట్నించీ ఉభయతారకంగా ఉంటుందని నేనే ఎదుటివాళ్ళకి టాపిక్ ఇస్తున్నాను.

పాపం, రెడ్డిగారు ఎక్కువ బ్రతిమాలించుకోకుండా, వెంటనే స్పందించాడు. ఐతే నేనూహించని విధంగా ఆశువుగా చెప్పిన అతడిమాటల్లోనూ కవిత్వమే ధ్వనించింది. ఆ మాటలనిక్కడ మీతో పంచుకుంటున్నానుః

రెడ్డిగారి కవిత

మనిషి

మంచివాడెందుకౌతాడు చెడ్డవాడెందుకౌతాడు

ఈ రెంటికీ

ప్రకృతి కారణమా మనిషే కారణమా

ఈ రెంటి సమన్వయం

ప్రకృతీ మంచీ

మంచీ మనిషీ

ఈ మూడూ కలిస్తే వేదాంతమౌతుందా?

నిజం చెప్పొద్దూ– ఆ మాటలు విని దిగ్భ్రాంతుణ్ణయ్యాను.

కవితా అనుకుంటే కవిత. అభిప్రాయమా అనుకుంటే అభిప్రాయం. స్పందనా అనుకుంటే స్పందన.

రెడ్డిగారు సామాన్యుడు కాదు– అనుకున్నాను.

ఐతే ఆయన తను కవినని చెప్పుకోలేదు. ఆతర్వాత కవిగా ఆయననుంచి రచనలు వచ్చినట్లూ తెలియదు.

ఇద్దరి కవితల్నీ టేపులో వినిపించాను. గ్రుండిగ్ స్పూల్ స్టీరియో రికార్డింగు అంటే ఇప్పటి డాల్బీ సౌండుని మించి ఉండేది.

కవిబాబు తన కవితలు విని మురిసిపోయాడు. రెడ్డిగారు హుందాగా నవ్వాడు.

కవిబాబుకి సంబంధించిన ముఖ్యమైన ముచ్చట్లివి.

ఇప్పుడు మనం మళ్లీ రావుగారి ముచ్చట్లలోకి వెడదాం......

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments